క్లుప్తంగా

లక్ష మల్లెపూల పూజోత్సవం


లక్ష మల్లెపూలతో పూజ చేస్తున్న అర్చకులు

అమలాపురం రూరల్: మండలంలోని గున్నేపల్లి అగ్రహారంలో ఉన్న పురాతన శివక్షేత్రం పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు లక్ష మల్లెపూల పూజోత్సవం గురువారం వైభవంగా జరిగింది. లోక కల్యాణార్థం గున్నేపల్లి అగ్రహార ప్రజలు పూజా క్రతువును చేపట్టారు. ఉదయం స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ పెదిరెడ్డి రాము, పెదమల్లు వీరభద్రం, అనుప్పిండి సీతారామయ్య, పెదమల్లు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం


చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకొని భద్రకాళీ అమ్మవారికి చండీ హోమం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, చండీ హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముత్యాలమ్మకు వైభవంగా క్షీరాభిషేకం

తాళ్లరేవు: చైత్రమాసం పవిత్ర పౌర్ణమి పర్వదినం సందర్భంగా గురువారం పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి క్షీరాభిషేకం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విళ్ల వీర, ప్రతినిధులు ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి సుబ్బారావు, భద్రం, పితాని వీరబాబు, పంపన చంద్రరావు, చెల్లంకూరి భవాని తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం


రామలింగయ్య చౌదరి(ఫైల్)

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవుకు చెందిన చోడే రామలింగయ్య చౌదరి(80) గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు. ఐ బ్యాంకు సిబ్బంది రవి కార్నియాలను సేకరించారు. నేత్రదానంకు అంగీకరించిన శ్రీనివాస్, మాలతీ దంపతులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు ధూళిపూడి వెంకటరమణ, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, భగవాన్ తదితరులు అభినందించారు.

ఘనంగా చైత్ర పౌర్ణమి పూజలు


శాకాంబర అలంకరణలో ఉమారాజలింగేశ్వర స్వామి

ఉప్పలగుప్తం: చైత్ర మాసాన్ని పురస్కరించుకుని పౌర్ణమి సందర్భంగా మండలంలోని గోపవరం గ్రామంలో ఉన్న ఉమా రాజలింగేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు జరిపారు. అర్చకులు వెల్లంపల్లి అబ్బన్న శర్మ ఆధ్వర్యంలో గురువారం స్వామి వారికి విశేష అభిషేకాలు చేసి, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

రెడ్ క్రాస్ సంస్థ వితరణ


బాధితులకు కిచెన్ పరికరాలు, నిత్యావసరాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

అమలాపురం రూరల్: బండారులంక పేరివారి కాలనీ అగ్ని ప్రమాద బాధితులు కారుపర్తి నాగ సుందరి, కాశిన శ్రావణాంబలకు కోనసీమ జిల్లా రెడ్ క్రాస్ సంస్థ తరపున టార్పాలిన్, కిచెన్ పరికరాలు, హైజిన్ కిట్, నిత్యావసర సరకులు గురువారం పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు సర్పంచ్ పెనుమాల సునీత, మాజీ జెడ్పీటీసీ చింతా శంకరమూర్తి, రెడ్ క్రాస్ కార్యదర్శి పీఎస్ శర్మ చేతుల మీదుగా నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో ఉప్పగంటి భాస్కర రావు, పి.ప్రభాకరరావు, ఎస్.కృష్ణమూర్తి, ప్రసాద్‌రావు, పి.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి రాచబాట

- బందరుపాలెం నుంచి గాడిలంక వరకూ రహదారి అభివృద్ధి
- సుమారు 20,000 మందికి ప్రయోజనం


ఆధునికీకరించిన బందరుపాలెం - గాడిలంక రహదారి

ముమ్మిడివరం: మండల శివారు గ్రామాల ప్రజలంతా ఏళ్ల నాటి రహదారి దెబ్బతిని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పంట దిగుబడులు మార్కెట్‌కు తీసుకెళ్లాలన్నా, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం మండల కేంద్రానికి చేరుకోవాలన్నా, వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రులకు వెళ్లాలన్నా ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. టీడీపీ ప్రభుత్వ హయాంలో రహదారి వేయండి మహాప్రభో అంటూ అటు ప్రజాప్రతినిధులకు, ఇటు ప్రజాప్రతినిధులకు ఎంతగా మొత్తుకున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ చొరవతో రహదారి ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయించారు. బందరుపాలెం నుంచి గాడిలంక వరకూ రహదారి నిర్మాణం పూర్తవ్వడంతో పది గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.2.26 కోట్ల నిధులతో నిర్మాణం

మండల శివారు గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముమ్మిడివరం మండలం బందరుపాలెం నుంచి కొత్తలంక మీదుగా క్రరివానిరేవు, గాడిలంక జాతీయ రహదారి-216 వరకూ సుమారు 7.35 కిలోమీటర్ల మేర జెడ్పీ రహదారి ఆధునికీకరించారు. దీనికోసం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో భాగంగా రూ.2.26 కోట్ల నిధుల్ని ఖర్చు చేశారు. నివాస ప్రాంతాల్లో సీసీ రోడ్డు, మిగిలిన ప్రాంతాల్లో బీటీ రోడ్డు నిర్మించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ప్రయాణ ఇక్కట్లు తొలగిపోయాయి. అంతేకాదు మండల ప్రజలతో పాటు కాట్రేనికోన మండల ప్రజలు ఐనాపురం, కొత్తలంక మీదుగా మురమళ్ల జాతీయ రహదారి-216 చేరుకొనేందుకు సైతం మార్గం సుగమమైంది. రైతుల ఉత్పత్తులను రవాణా చేసుకొనేందుకు ఆస్కారమేర్పడింది. మత్స్యకారులు మత్స్య సంపదను మార్కెట్ ప్రాంతానికి తరలించేందుకు వీలు కలుగుతోంది. పది గ్రామాలకు చెందిన సుమారు 20 వేల మందికి ఈ రహదారి ఉపయోగపడుతోందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మార్గం సుగమమైంది



అయినాపురం నుంచి కొత్తలంక, క్రరివాని రేవు మీదుగా మురమళ్ల 216 జాతీయ రహదారికి చేరుకొనేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంది. గతంలో ముమ్మిడివరం మీదుగా మురమళ్ల వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కొత్త రహదారి కారణంగా సుమారు 5 కిలోమీటర్ల దూరం కలిసొస్తుంది.

– ముదునూరి రామరాజు, రైతు, అయినాపురం

రవాణా సౌకర్యం ఏర్పడింది



వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు రోడ్డు బాగోక నానా ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు రహదారిని ఆధునికీకరించి రవాణా సౌకర్యం ఏర్పరచడంతో లారీలు, ఇతర వాహనాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లగలుగుతున్నాం.

– కె.రాధాకృష్ణ, మర్లపాలెం

వంకర కాళ్లతో దూడ జననం

శస్త్ర చికిత్సతో నయం


శస్త్ర చికిత్స తర్వాత లేగ దూడ(చిత్రంలో వైద్యులు)

అమలాపురం టౌన్: నడవ లేని స్థితిలో వంకర కాళ్లతో పుట్టిన లేగ దూడకు స్థానిక పశు సంవర్ధక ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యులు గురువారం అత్యవసర శస్త్రచికిత్స చేశారు. అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి గ్రామానికి చెందిన రైతు విప్పర్తి సూర్యనారాయణ కమతంలోని ఆవుకు మూడు రోజుల కిందట వంకర కాళ్లతో లేగ దూడ పుట్టింది. నడవ లేక అవస్థ పడుతున్న పెయ్య లేగ దూడను రైతు అమలాపురం పశువుల ఆస్పత్రికి తీసుకొచ్చారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి, డాక్టర్ శివరామకృష్ణ దూడకు శస్త్ర చికిత్స చేసి నయం చేశారు.


శస్త్ర చికిత్సకు ముందు వంకర కాళ్లతో లేగ దూడ

ప్రజలందరికీ శుద్ధమైన తాగునీరే లక్ష్యం


సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్


రావులచెరువులో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

అల్లవరం: ప్రజలందరికీ శుద్ధమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ఓహెచ్‌ఆర్ ట్యాంకులు నిర్మాణం చేసి పూర్తి స్థాయి తాగునీరు సరఫరా చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. సర్పంచ్ ఉండ్రు భగవాన్‌దాస్ అధ్యక్షతన డి.రావులపాలెంలో వేదాంత సీఎస్ఆర్ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ని మంత్రి విశ్వరూప్ గురువారం ప్రారంభించారు. అనంతరం గుండెపూడిలో సర్పంచ్ గుంటూరి కృష్ణంరాజు అధ్యక్షతన రూ.45 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రారంభించారు. మత్స్యకార గ్రామంలో వేదాంత సీఎస్ఆర్ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ని ప్రారంభించారు. అనంతరం మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఎన్నికల ముందు ఈ రెండు గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పనులు పూర్తి చేసి తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జున్నూరి రామారావు, ఎంపీపీ ఇళ్ల శేషారావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీలు వడ్డి గంగాభవాని, ముత్యాల వెంకట రామకృష్ణ, సర్పంచ్‌లు సుందరనీడి సాయికృష్ణ, రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, తిక్కిరెడ్డి శ్రీను, ఎంపీటీసీలు మాకే కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలోని 30వ వార్డు రావులచెరువు ప్రాంతంలో ఓఎన్జీసీ కేజీ బేసిన్ సీఎస్ఆర్ నిధులు రూ.7.80 లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం ప్రారంభించారు. ఈ ప్లాంట్ వల్ల పట్టణ శివారు రావుల చెరువు, రూరల్ మండలం జనుపల్లి తదితర ప్రాంతాల ప్రజల దాహార్తి తీరుతుందని మంత్రి విశ్వరూప్ అన్నారు. సామాజిక సేవలో భాగంగా శివారు ప్రజలకు వాటర్ ప్లాంట్ నిర్మించి ఇచ్చిన ఓఎన్జీసీని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, స్థానిక వార్డు కౌన్సిలర్ యన్నాబత్తుల పద్మ, రాజమహేంద్రవరం కేజీ బేసిన్ జియాలజీ జీఎం బీఎస్ఎస్ కృష్ణమూర్తి, చెన్నై ఓఎన్జీసీ సీఎస్ఆర్ హెచ్‌ఆర్ ఇన్‌చార్జి జయంతి లక్ష్మణన్, కో ఆర్డినేటర్ వి.శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నాలుగేళ్ల సంక్షేమ సమాచారం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ గత నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల సమగ్ర సమాచారాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి వివరించే వినూత్న కార్యక్రమాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్', మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లను మంత్రి విశ్వరూప్ స్థానిక సర్ ఆర్థర్ కాటన్ అతిథి గృహం ఆవరణలో గురువారం ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- మహిళలకు ఆసరా మూడో విడత చెక్కు అందజేత

ఐ.పోలవరం: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఐ.పోలవరం మండలం మురమళ్ల హైస్కూల్ వెనుక లేఅవుట్ ఆవరణలో గురువారం నిర్వహించిన ఆసరా మూడో విడత రుణమాఫీ చెక్కు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడో విడత ఆసరా పథకం ద్వారా మండలంలో 1,171 సంఘాలకు చెందిన 11,710 మందికి గాను రూ.8,53,39,830 చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ సభలకు హాజరవుతున్నారంటే ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై ఎంత నమ్మకంతో ఉన్నారో స్పష్టమవుతోందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా మహిళలు మహారాణులు కావాలన్నదే సీఎం జగన్ ధ్యేయమన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకూ వివిధ పథకాల ద్వారా రూ.18 వేల కోట్లను లబ్ధిదారులకు అందజేశామన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మహిళలంతా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించుకోవాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో హితకారిణి సంస్థ చైర్మన్ కాశి బాలమునికుమారి, ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ కాశే రాజుబాబు, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, దేవస్థాన చైర్మన్లు పెన్మత్స వాసురాజు, కె.గంగబాబు తదితరులు పాల్గొన్నారు.


డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వరం


జార్జిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్


గోపవరంలో 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సంపదరావు తదితరులు


104 వాహనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ముదునూరి సతీష్ రాజు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభం

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ విధానం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వరమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. గురువారం జార్జిపేట వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఇంటివద్దే మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ప్రారంభించారన్నారు. దీని ద్వారా నెలలో రెండుసార్లు గ్రామంలోకి ఇద్దరు వైద్యులతో పాటు 12 మంది పారామెడికల్ సిబ్బంది హాజరై వైద్యసేవలను అందిస్తారన్నారు. 14 రకాల పరీక్షలతో పాటు బీపీ, షుగర్ వంటి వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం మండలానికి నూతనంగా మంజూరైన 104 వాహనాన్ని ఎమ్మెల్యే పొన్నాడ ప్రారంభించారు. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, స్థానిక సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి, పార్టీ రాష్ట్ర నాయకులు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవింద కుమార్, రాయుడు గంగాధర్ పాల్గొన్నారు.

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వైద్యాన్ని అందిస్తున్నారని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో బోడసకుర్రులో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, వైద్యురాలు ఎ.లక్ష్మీలలిత, మట్టపర్తి షణ్ముఖరావు, ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం సచివాలయం-2, గోపవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గోపవరం గ్రామంలో ఎస్.యానం పీహెచ్‌సీ పరిధికి సంబంధించిన నూతన 104 వాహనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, చిక్కం బాల సుబ్రహ్మణ్యం, అడబాల మాధవ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా మురమళ్లలో గురువారం జరిగిన వైఎస్సార్ ఆసరా రుణమాఫీ పంపిణీ కార్యక్రమంలో భాగంగా నూతన 104 వాహనాన్ని జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా నెలలో రెండు రోజులు లేవలేని స్థితిలో ఉన్న రోగుల వద్దకే డాక్టరు వచ్చి చికిత్స, మందులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణి మిరియం జ్యోతి, సర్పంచ్ కాశే రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా అవకతవకలపై నిలదీత

మండల పరిషత్ సమావేశంలో సభ్యుల మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గంటి వెంకట సుధాకర్

కాట్రేనికోన: మండలంలో పలు డ్వాక్రా సంఘాల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి పత్రికల్లో ప్రచురితమైన కథనాలపై చేపట్టిన చర్యలను సమావేశం దృష్టికి తీసుకురావాలంటూ ఏపీఎం వెంకటేశ్వరరావును సభ్యులు నిలదీశారు. కాట్రేనికోన మండల పరిషత్ సమావేశం వైస్ ప్రెసిడెంట్ సానబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పూడి, అడవిపేట, బట్టుచెరువు, వెంకమ్మ చెరువు గ్రూపుల్లో యానిమేటర్ల ప్రమేయంతో ప్రెసిడెంట్‌లు సభ్యులకు తెలియకుండా లక్షలాది రూపాయలు సొంత ఖర్చులకు వాడుకున్నారని వాటిపై మీరు తీసుకున్న చర్యలేంటని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గంటి వెంకట సుధాకర్, సర్పంచ్‌లు నాతి అలివేణి, చెల్లి సురేష్, వైఎస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు తదితరులు ఏపీఎం వెంకటేశ్వరరావును ప్రశ్నించారు. అధికారుల అలసత్వంతోనే సంఘాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వాతావరణంలో మార్పులను పరిగణలోకి తీసుకుని నిబంధనలు సవరించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని చెయ్యేరు సర్పంచి చెల్లి సురేష్ అన్నారు. సాగు నీటిని రైతులకు అందించినట్లుగా తాగు నీటిని శివారు గ్రామాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పల్లంకుర్రు సర్పంచి నాతి అలివేణి అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్ కుమార్, రైతు భరోసా కేంద్రం చైర్మన్ నాతి సత్యనారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: బార్ అసోసియేషన్‌కు ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక కోర్టు భవనాల ఆవరణలో గురువారం సాయంత్రం జరిగింది. నూతన కార్యవర్గాన్ని జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ అభినందించారు. నూతన కార్యవర్గ ప్రతినిధులు న్యాయమూర్తి నరేష్ వద్దకు వెళ్లి తమను పరిచయం చేసుకున్నారు. నూతన కార్యవర్గం చేత బార్ అసోసియేషన్ ఎన్నికల కమిషనర్ కటికదల సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు.

సాహస కానిస్టేబుల్‌కు అభినందన

యానాం-ఎదుర్లంక వంతెన వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను గోదావరిలోకి దూకి రక్షించిన ఏఆర్ కానిస్టేబుల్ ఎ.వీరబాబును బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అభినందించి సత్కరించింది. కానిస్టేబుల్‌ను జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి నరేష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, రూ.5 వేల నగదు బహుమతి అందించారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు యూపీ లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, ప్రధాన కార్యదర్శి డీవీఎస్ మూర్తి, కార్యదర్శి బడుగు భాస్కర్ జోగేష్‌తోపాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

హాస్టళ్లను అప్‌గ్రేడ్ చేయాలంటూ వినతి

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా ఉన్న 28 ఎస్సీ బాలబాలికల హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ పుదుచ్చేరి ఆదిద్రావిడ సంక్షేమ మంత్రి చంద్రికా ప్రియదర్శినికి లేఖ రాసినట్లు అంబేడ్కర్ సంక్షేమ సంఘ వ్యవస్థాపకుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీల్లో నాణ్యమైన విద్య కోసం రెసిడెన్షియల్ విద్యావిధానాన్ని ప్రవేశ పెట్టడానికి ఇదే సరైన సమయమన్నారు.

ఆశీలు కట్టేందుకు నిరాకరణ

యానాం: యానాం ఇందిరాగాంధీ మార్కెట్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదని నిరసిస్తూ మున్సిపాలిటీ సిబ్బందికి ఆశీలు కట్టేందుకు గురువారం పలువురు చేపల వ్యాపారులు నిరాకరించారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ మార్కెట్‌లో నీటి సదుపాయం, విద్యుత్, క్లీనింగ్ తదితర సౌకర్యాలను సంబంధిత మున్సిపాలిటీ కల్పించాల్సి ఉన్నా పట్టించుకోకుండా కేవలం ఆశీలు కట్టాలని మాత్రం వస్తున్నారన్నారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలని వారు మున్సిపల్ సిబ్బందిని కోరారు.

పంట కోత ప్రయోగం

ఉప్పలగుప్తం: మండలంలోని నంగవరం గ్రామంలో రైతు దొడ్డిపట్ల దుర్గారావు వరి క్షేత్రంలో నిర్వహించిన పంట కోత ప్రయోగంలో ఎంటీ-13 రకం వంగడం వరి ఎకరానికి 65.5 బస్తాలు దిగుబడి ఇచ్చిందని ఏవో జి.కుమార్ బాబు గురువారం తెలిపారు. దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎం.దుర్గాలక్ష్మి, ఇన్సూరెన్స్ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

11న జాబ్ మేళా

అమలాపురం రూరల్: ఈ నెల 11వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు అమలాపురంలోని ఉపాధి కార్యాలయం వద్ద ప్రముఖ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, డిగ్రీ, ఫార్మసీ ఉత్తీర్ణులైన యువతీయువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 96422 55545 ఫోన్ నెంబర్‌కు సంప్రదించొచ్చన్నారు.

గృహ సారథులకు కిట్లు అందజేత

అమలాపురం టౌన్: పట్టణంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే 'జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలకు సంబంధించి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు కార్యక్రమ కిట్లను మున్సిపల్ ప్రజాప్రతినిధులు ఆయా వార్డుల్లో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు సంసాని బులినాని, మట్టపర్తి నాగేంద్ర, దొంగ నాగ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో మత్స్యశాఖ ద్వారా వృద్ధాప్య పింఛన్లు పొందుతూ ఎవరైనా మృతి చెందితే వారి అంత్యక్రియల ఖర్చులకు గాను రూ.15 వేలు ఇవ్వనున్నట్లు మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లీగల హెయిర్ ప్రకారం మృతుని కుటుంబానికి చెందిన నామినీకి అంత్యక్రియల మొత్తాన్ని ఇస్తామన్నారు. ఎవరైనా వృద్ధాప్య పింఛన్ తీసుకునే మత్స్యకారులు మృతి చెందితే మత్స్యశాఖకు తెలియజేయాలని కోరారు. ఈ ఆర్థిక సాయం మంజూరు ఏప్రిల్ నెల నుంచి అమల్లోకి వచ్చిందన్నారు.

వైభవంగా వెంకన్న చక్రస్నానం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా పదో రోజు గురువారం స్వామి వారి చక్ర స్నానం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో తీసుకెళ్లి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో అర్చకులు శాస్త్రోక్తంగా స్నానం చేయించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, గోవింద నామస్మరణ నడుమ ఈ క్రతువు సాగింది. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, దూడల ఫణి, కల్యాణ మండప నిర్మాణ దాత బండిగుప్తాపు పాండురంగ, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.